
అప్రమత్తతోనే సంపూర్ణ ఆరోగ్యం

వర్షాకాలంలో పొంచి ఉన్న వ్యాధుల భయం

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండగలమని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో కురిసే వర్షాలు ఆహ్లాదంతో పాటు వ్యాధులను తీసుకొస్తాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

గుడివాడరూరల్: వేసవిలో అధిక ఉష్ణోగ్రతలతో విలవిలలాడిన ప్రజలు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు కొంత ఉపశమనం కల్పించినా, గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి, ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వ చేరి దోమలు వృద్ధి చెందుతాయి. దీంతో ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా వైరల్ జ్వరాలు, మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు విజృంభిస్తాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.


ఆడ ఎనాఫిలిస్ దోమ (ఫైల్)

మలేరియా..

మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్న జీవి సంక్రమించిన ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా వస్తుంది. ఈ దోమలు మంచి నీరు, మురుగు నీటి నిల్వల్లో పెరిగి మలేరియాను వ్యాప్తి చేస్తాయి. ఈ దోమ కుట్టడం వలన ఏడు నుంచి 10 రోజుల లోపు ఒళ్లు నొప్పులతో కూడిన విపరీతమైన జ్వరం రోజుమార్చి రోజు వస్తుంది. ఆ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యుడ్ని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందాలి.

డెంగీ..

దోమ కాటు ద్వారా ఆకస్మికంగా జ్వరంతోపాటు నొప్పులు వస్తే అది డెంగీ కావచ్చు. ఇది ఆడ ఈడిస్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. ఇవి పగటి పూట ఎక్కువగా కుడతాయి. ఈ దోమకాటు వేసిన మూడు నుంచి 14రోజుల్లో డెంగీ రావచ్చు. ఈ వ్యాధి వలన జ్వరంతో పాటు కీళ్లు, కండరాల నొప్పులు, వాంతులు అవుతాయి. కొంతమందికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తం కారుతుంది. దీనికి అత్యవసరమైన చికిత్సతో పాటు కొందరికి ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి వస్తుంది. గర్భిణులు, చిన్న పిల్లలు ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ప్రమాదం ఎక్కువ. అందు వలన త్వరితగతిన చికిత్స చేయించుకోవాలి.

చికున్ గున్యా..

చికున్ గున్యా వైరస్‌తో ఇన్‌ఫెక్ట్ అయిన ఈడిస్ దోమ కుట్టడం ద్వారా వ్యాధి వస్తుంది. ఈ దోమ కుట్టిన మూడు నుంచి 12 రోజుల లోపు జ్వరం వస్తుంది. తలనొప్పి, వాంతులు, వికారంతో హఠాత్తుగా వచ్చే జ్వరం దీని ముఖ్య లక్షణం.

ఈ వ్యాధి లక్షణాలు

చికున్ గున్యా శరీరంలో అన్ని కీళ్లను బాధిస్తుంది. ముఖ్యంగా చేతి వేళ్లు, కీళ్ల నొప్పుల వలన నిలబడలేని పరిస్థితి ఉంటుంది. జ్వరం తగ్గినా ఈ నొప్పులు చాలా కాలం ఉంటాయి. ఈ లక్షణాలు కనబడిన వెంటనే దగ్గర్లోని వైద్య, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలి


ఆడ ఈడిస్ దోమ (ఫైల్)

డయేరియా(అతిసార), టైఫాయిడ్

కలుషిత ఆహారం తీసుకోవడం వలన అతిసార, టైఫాయిడ్ వ్యాధులు సంక్రమిస్తాయి. రోజుకు మూడు అంతకంటే ఎక్కువసార్లు నీళ్ల విరోచనాలు అయితే దానిని అతిసార వ్యాధి అంటారు. ఇది బాక్టీరియా వల్ల కానీ, వైరస్ వలన కానీ రావచ్చు. వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి, దాహం, నోరు ఎండిపోవడం, మూత్ర విసర్జన తగ్గిపోవడం ఈ వ్యాధి లక్షణాలు. అలాగే క్యూలెక్స్ దోమ వలన ఫైలేరియా(బోద) వస్తుంది. జపనీస్ ఎన్‌సెఫెలైటీస్ అనే వైరస్ వలన ఇది వ్యాప్తి చెందుతుంది. దీని వలన మెదడు వ్యాపు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధులను అధిగమించే క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక చర్యలు



గ్రామాల్లో వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా వీధులు, రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా మండల స్థాయి అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రక్షిత మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు కూడా చేపడుతున్నాం. ఏ గ్రామంలోనైనా పారిశుద్ధ్య సమస్య ఉంటే మా దృష్టికి ప్రజలు తీసుకువస్తే వెంటనే చర్యలు చేపడతాం.

– గద్దే పుష్పరాణి, ఎంపీపీ

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం



సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత, ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలి. ముఖ్యంగా వైరస్, బాక్టీరియా వలన వ్యాధులు వస్తాయి. వీటి గురించి అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు. ప్రస్తుతం వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఇంట్లో వండుకునే పదార్థాలు వేడిగా ఉన్నప్పుడు తీసుకోవాలి. వంటపాత్రలపై మూతలు పెట్టుకోవాలి. ఇంటి చుట్టూ మురుగు, వర్షపు నీరు నిల్వ లేకుండా, మురికి కూపాలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

–సతీష్‌కుమార్, వైద్యాధికారి

అధ్వానంగా పంట కాలువలు

ఆందోళనలో అన్నదాతలు

తోట్లవల్లూరు: మండలంలో ప్రధాన పంట కాలువలు అధ్వానంగా మారటం, సీజన్ తరముకొస్తున్నా కాలువలకు నీరు విడుదల చేయకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధానంగా కేఈబీ కాలువ, బందరు కాలువ, పుల్లేరు కాలువ ప్రవహిస్తుంటాయి. ఆయా కాలువల ద్వారా విజయవాడ నుంచి బందరుతో పాటు దివిసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు సరఫరా జరుగుతుంది. మండల వ్యాప్తంగా సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తారు. దీనిలో నాలుగు వేల ఎకరాల వరకు మోటారు బోర్ల ద్వారా, మిగిలిన నాలుగు వేల ఎకరాలు కాలువలద్వారా వచ్చే నీటితో సాగవుతుంది.


తోట్లవల్లూరు వద్ద గుర్రపుడెక్క, తూటుకాడతో నిండిన బందరు కాలువ

కాలువల నిండా గుర్రపుడెక్క

కాలువలు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా గుర్రపుడెక్క, తూటుకాడతో అల్లుకుపోయి సాగు, తాగు నీరు ముందుకు కదిలే పరిస్థితి లేకుండా పోయింది. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా పరిణమించింది. ఖరీఫ్ సీజన్‌కు ముందే కాలువల్లో గుర్రపుడెక్క, తూటుకాడ నిర్మూలనకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


యాకమూరు వద్ద అధ్వానంగా పుల్లేరు కాలువ

సాగు నీటి కోసం ఎదురుచూపు

కాలువల ద్వారా సాగు నీటి విడుదల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. జూన్ మాసం ముగిసినా కాలువలకు నీరు విడుదల చేయకపోవటంపై ఆందోళన చెందుతున్నారు. బోర్ల ద్వారా నీటి అవకాశం ఉన్న రైతులు వరినాట్లకు సన్నద్ధం అవుతుంటే కాలువపైనే ఆధారపడిన వారికి మాత్రం ఎదురు చూపే మిగులుతోంది. ప్రభుత్వం స్పందించి కాలువలలో గుర్రపుడెక్క, తూటుకాడ నిర్మూలనకు చర్యలు తీసుకోవటంతోపాటు సకాలంలో సాగు నీరు విడుదల చేసి ఖరీఫ్ సాగు ముందుకు సాగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

క్రిమినల్ చట్టాల సవరణ సరికాదు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న క్రిమినల్ చట్టాల మార్పు ప్రక్రియ సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో ఏ విధమైన చర్చ జరుగకుండా, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా మేధావుల సూచనలు, సలహాలు తీసుకోకుండా ఈ విధమైన చట్ట సవరణలు చేయడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం నిర్ణయాల వలన రాబోయే రోజుల్లో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజా స్వామ్యంలో ఏకపక్ష నిర్ణయాలు సరికాదని ఈ విధమైన చర్యలను సీపీఎం ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి ఎన్. మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

చార్టెర్డ్ ఎకౌంటెంట్‌కు సత్కారం

గుడివాడ టౌన్: చార్టెర్డ్ ఎకౌంటెంట్స్ డేను పురస్కరించుకుని మంగళవారం పట్టణానికి చెందిన ఆడిటర్ పోకూరి లక్ష్మి రామ సుబ్రహ్మణ్యంను ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆఓపా)ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మందపాడులోని శరణార్థు వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకుల పంపిణీ, అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కస్సెట్టి శ్రీనివాస్, కార్యదర్శి ఎండూరి శ్రీనివాస్, కోశాధికారి వి.కిరణ్ కుమార్, పి.రామకృష్ణ, పి. శ్రీనివాస్, ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.


ఆడిటర్ సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న నాయకులు

నూతన వ్యవసాయ పద్ధతులపై రైతుల మొగ్గు

పామర్రు: రైతులు సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన పద్ధతులపై మొగ్గు చూపుతున్నారు. మండలంలో ఎక్కువ మంది రైతులు వెదజల్లే పద్ధతులను అనుకరిస్తున్నారు. గతంలో వరి పండించేందుకు నాట్లు వేసే వారు. దీనికి ముందు ఎకరానికి 25 కేజీల వరి విత్తనాలను నారు మడులుగా వేసి నారు ఏపుగా పెరిగిన తర్వాత నాట్లు వేసే వారు. అయితే దీనికి ఖర్చు అధికం కావడంతో రైతులు చాలా మంది వెదజల్లే పద్ధతిపై మొగ్గు చూపుతున్నారు. సాగునీరు పూర్తిగా రాకపోవడం వల్ల వర్షం నీటినే పంట పొలాలకు ఉపయోగించి రైతులు విత్తనాలను వెద జల్లుతున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు సుమారు 1,500 ఎకరాలకు పైగా వెదసాగు చేస్తున్నట్లు సమాచారం.


పామర్రులో వెదజల్లే పద్ధతిలో వరి సాగు

అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలి

ముదినేపల్లి రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని ముదినేపల్లిలో మంగళవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ తొలుత మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటాలనే ప్రచారం పుడమి తల్లిని ఎంతగానో కాపాడుతుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని, ఇందుకు బీజేపీ శ్రేణులు ముందుకు రావాలని కోరారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధిక, జిల్లా కార్యవర్గ సభ్యులు మేలిమి లక్ష్మణరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ నాయకులు కైకలూరు పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల వద్ద మంగళవారం మొక్కలు నాటారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనరు వేంపాటి విష్ణురావు మాట్లాడుతూ ప్రధాని మోదీ 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరుతో జూలై 2 నుంచి 6వ తేదీ వరకు ప్రతిఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలని చెప్పారన్నారు. భావితరాలకు బంగారు భవిష్యత్‌ను అందించడానికి ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని కోరారు. కార్యక్రమాల్లో సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్యక్రమ ఇన్‌చార్జి కోటప్రోలు కృష్ణారావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి రాంప్రసాద్, మండల అధ్యక్షుడు కట్టా వీర రాఘవులు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి బొల్లా శ్యామలరాజు, నాయకులు పోలగాని మహాలక్ష్ముడు, ఏసుపాదం, బందా సత్యనారాయణ ప్రసాద్, పామర్తి రాంబాబు, యలవర్తి లక్ష్మీదీపక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

టిడ్కో గృహాల వేలం ఆపండి

గుడివాడ టౌన్: టిడ్కో కాలనీల్లో గృహాల లబ్ధిదారులు బకాయిలు చెల్లించకుంటే ఫ్లాట్లు వేలం వేస్తామని బ్యాంకు అధికారులు ఇచ్చిన నోటీసులను నిలుపుదల చేయాలని లబ్ధిదారులు కోరారు. స్థానిక గౌరీశంకరపురంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను లబ్ధిదారులు మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కమిటీ సభ్యురాలు బసవ అరుణ మాట్లాడుతూ ఒక్కసారిగా రూ. 30 వేలు, రూ. 40 వేలు చెల్లించే స్తోమత లబ్ధిదారుల వద్ద లేదన్నారు. చిన్న వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించగలమని తెలిపారు. అయితే ప్రభుత్వం రుణాలు మాఫీచేస్తామని హామీ ఇచ్చిందని ఆ విషయంలో కూడా లబ్ధిదారులకు సరైన సమాచారం లేదన్నారు. కావున లబ్ధిదారులపై ఒత్తిడి పెంచకుండా గడువు ఇవ్వాలని ఆమె కోరారు. దీనిపై స్పందించిన బ్యాంక్ మేనేజర్ నెలవారీ చెల్లించే వాయిదా మొత్తంలో మార్పు చేసే వెసులుబాటు ఉంది తప్ప రుణమాఫీ విషయం తమకు తెలియదని తేల్చేసారని అరుణ తెలిపారు.


బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

వీరజవాన్ నాగరాజుకు నివాళి

పెదన: మండలంలోని చేవేంద్ర గ్రామానికి చెందిన వీర జవాను సాదరబోయిన నాగరాజుకు పెడన సెయింట్ విన్సెంట్ పల్లోటి హైస్కూలు మంగళవారం ఘనంగా నివాళులర్పించింది. తూర్పు లద్దాఖ్‌లోని నదిలో సైనిక విన్యాసాల్లో నాగరాజు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో దేశ సైనికుడు నాగరాజు ప్రమాదవశాత్తు చనిపోవడం చాలా బాధకరమని పల్లోటి స్కూలు కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి అన్నారు. మంగళవారం నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నాగరాజు దేశసేవకు అంకితభావంతో చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆ దేవుని ఆదరణ కుటుంబీకులకు కలగాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ యాకోబు పాల్గొన్నారు.

భార్య కనిపించడం లేదంటూ భర్త ఫిర్యాదు

కైకలూరు: భార్య కనిపించడం లేదంటూ భర్త కైకలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు వదర్లపాడు గ్రామానికి చెందిన వలల మేస్త్రీ వెలివెల హనుమంతుకు గుడివాడకు చెందిన మహాలక్ష్మితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇంకా పిల్లలు కలగలేదు. ఇదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పెద్దిశెట్టి గోపి వలలు తీసుకెళ్లే నిమిత్తం ఇంటికి వస్తూ మహాలక్ష్మితో పరిచయం ఏర్పరచుకున్నాడు. వారిద్దరూ కలిసి ఊరు విడిచి పరారయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గోపికి వివాహం జరిగి ఇరువురు సంతానం ఉన్నారు. రూరల్ ఎస్సై టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల పట్టివేత

కైకలూరు: గ్రామాల్లో మద్యం అక్రమ విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలిదిండి ఎస్సై ప్రియకుమార్ హెచ్చరించారు. కలిదిండి మండలం వెంకటాపురం శివారు బరింకలగరువులో తాటి వెంకటేశ్వరరావు బడ్డీ కొట్టులో మంగళవారం నాలుగు మద్యం సీసాలు లభించాయి. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.

క్లుప్తంగా

కొండలమ్మకు లక్ష మల్లెల పూజ



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారికి ఏకాదశిని పురస్కరించుకుని లక్ష మల్లెల పూజను మంగళవారం ఆలయ ఈఓ కానూరి సురేష్ ఆధ్వర్యంలో వేద పండితులు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారికి విశేషాభిషేకాలను చేపట్టారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రథమ కర్తవ్యం



పామర్రు: ప్రజారోగ్య పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో వైద్యులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. డయేరియా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్య, వైద్య రంగాలను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో బాగంగా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

వైభవంగా శాంతి కల్యాణం



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణతంతు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

విశ్వ బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



గుడివాడ టౌన్: విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ విద్యార్థులు వైద్యవృత్తి వైపు దృష్టిపెట్టాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. మంగళవారం విశ్వకర్మ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కార కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతిలో 550 మార్కులు పైబడి సాధించిన 15 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, స్వర్ణపతకం, రూ.1,000 అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బసవేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కృష్ణకిషోర్, రెడ్ క్రాస్ సంస్థ జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, డి.నగేష్, అప్పారావు, నాగాచారి పాల్గొన్నారు.

ఉచితంగా కంటి ఆపరేషన్లు



కూచిపూడి(మొవ్వ): శంకర నేత్రాలయ కంటి వైద్యశాల(మద్రాసు), నటరాజ నాట్యాంజలి సంయుక్త ఆధ్వర్యంలో మొవ్వ మండలం కూచిపూడిలోని ఎస్ఎస్ఎల్ కన్వెన్షన్ హాల్లో సాగుతున్న ఉచిత కంటి పార చికిత్సా శిబిరంలో మంగళవారం నుంచి ఆపరేషన్లు ప్రారంభించారు. గత నెల 28వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి శుక్లం ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ అత్యాధునిక పద్ధతి ద్వారా కుట్టు, నొప్పి లేకుండా 25 మందికి సర్జరీలు నిర్వహిస్తున్నట్లు నేత్ర వైద్యాలయం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అరుల్ తెలిపారు.

ఏపీసీపీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

గుడివాడ టౌన్: విద్యుత్ బిల్లుల చెల్లింపు విధానంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను అనుసరించి ఖాతాదారులు ఏపీసీపీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ టి.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మాదిరిగా ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్‌లలో బిల్లులు చెల్లించేందుకు తమ పేరు ఏపీసీపీడీసీఎల్ డిస్కాంలో కనిపించదని పేర్కొన్నారు. వినియోగదారులు గూగుల్ ప్లేస్టోర్ నుంచి పై యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దాని ద్వారా బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. వీటితో పాటు డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్, క్యాష్‌కార్డు కూడా ఈ యాప్ ద్వారా వినియోగించుకునే వెసులుబాటు ఉందని పేర్కొన్నారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు



పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం చివరి మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి ఆవుపాలతో, పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకాలను చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పాల పొంగళ్లను వండి స్వామికి నివేదనలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సహాయకులుగా ఫణి, శర్మ వ్యవహరించారు.

ఈస్టు ఫీల్డు కౌన్సిల్ అధ్యక్షుడిగా యేసుదాసు



జమీగొల్వేపల్లి(పామర్రు): ఉయ్యూరు ఈస్టు ఫీల్డు కౌన్సిల్ సభ్యుల సమావేశం మండల పరిధి జమీగొల్వేపల్లి సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫీల్డు కౌన్సిల్ సభ్యుల ఎంపిక జరిగింది. ఈ ఎంపికలో ఈస్టు ఫీల్డు అధ్యక్షుడిగా రెవ. కె.యేసుదాసు, కార్యదర్శిగా వల్లూరు రవీంద్రబాబు, ట్రెజరర్‌గా కె సుధాకర్‌బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ప్రియంగా మారిన వరిగడ్డి


ట్రాక్టర్‌పై వరిగడ్డిని ఇంటికి చేర్చుతున్న దృశ్యం

మండవల్లి: వరిగడ్డి ప్రియంగా మారడంతో రైతులతో సహా అన్నివర్గాలవారు సమస్యలు ఎదుర్కొంటున్నారు. గతంలో ట్రాక్టర్ గడ్డి ఖరీదు రూ.7 వేలు ఉండగా ప్రస్తుతం రూ.15 వేల వరకు పెరిగింది. సార్వా సాగులో రైతులు అపరాలు వేస్తున్నారు. దీంతో వరి పైరు లేని కారణంగా గడ్డి దొరికే అవకాశం లేదు. అలాగే ఖరీఫ్ సాగులో వరి పండించినప్పటికీ కూలీల ఖర్చులు అధికంగా ఉండటంతో యంత్రాలతో వరికోతలు కోయిస్తున్నారు. కుప్ప నూర్పిళ్లు కూడా యంత్రాల ద్వారానే చేయిస్తున్నారు. దీంతో గడ్డి సక్రమంగా వచ్చే చాన్స్ లేదు. దీంతో వరిగడ్డి లభించడం కష్టంగా మారింది. వరిగడ్డి కొరతతో కొందరు రైతులు పశువులను పెంచేందుకు సైతం వెనుకాడుతున్నారు. కాగా కొందరు ఇంటి పైకప్పులకు తాటాకు, వరిగడ్డినే వాడుతున్నారు. అలాగే గేదెల పాకల వేసేందుకు సైతం వరిగడ్డి అవసరం. అయితే గడ్డి రేటు బాగా పెరిగిపోవడంతో ఆయా వర్గాల వారందరూ ఇబ్బందులు పడుతున్నారు.

రవాణా ఖర్చులూ భారమే

కొనుగోలు చేసిన గడ్డిని తమ ఇంటి వరకు చేర్చడానికి సైతం రవాణా ఖర్చులు విపరీతంగా అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. సుమారు రూ.1,000 నుంచి దూరాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ.3 వేలు వరకు రవాణా చార్జీ అవుతుందని, ఈ ఖర్చులను సామాన్యులు భరించలేని పరిస్థితి అని వాపోయారు.

కూర్చోడానికి కుర్చీలు ఏవీ?

కైకలూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వివిధ పనులపై వచ్చే ప్రజలు కూర్చోడానికి కనీసం కుర్చీలు లేవని బీజేపీ నాయకులు బండి శ్రీనివాసరావు మంగళవారం ఆరోపించారు. ఇటీవల దాతల సాయంతో నూతన భవనం నిర్మించినప్పటికీ సీనియర్ అసిస్టెంటు, ఇతర కేడర్ల సిబ్బంది పనిచేసే గదిలో ప్రజల కోసం కుర్చీలు వేయలేదని పేర్కొన్నారు. దీంతో పని మీద వచ్చే అందరూ నిలబడాల్సి వస్తోందన్నారు. ఈ విషయంపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.